క్లుప్తంగా

సామూహిక సత్యదేవుని వ్రతాలు


సత్యనారాయణస్వామి వ్రతాలు చేస్తున్న భక్తులు

కాళ్ల: సీసలి గ్రామంలో వేంచేసియున్న షిర్డీ సాయిబాబా ఆలయం 21వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం భక్తులచే ఉచిత సామూహిక సాయిసత్య వ్రతాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. సుమారు 800 మంది దంపతులతో కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. భీమవరానికి చెందిన పెన్మెత్స వెంకట శివ ప్రసాద మూర్తిరాజు, లక్ష్మి దంపతుల ఆర్థిక సాయంతో భక్తులకు భోజనం, ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ తోరం అనంతలక్ష్మి సత్యవతిదేవి, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలు తొలగించిన దృశ్యం


కాళ్ల: మండలంలోని కోమటిగుంటలో పరిశుభ్రతకు, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ఎవరికి వారు ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించడం అభినందనీయమని సర్పంచ్ బోణం భాగ్యశ్రీ శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని ప్రభుత్వ భూముల్లో గత కొంత కాలంగా కొందరు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారన్నారు. అయితే గ్రామంలో అభివృద్ధికి తోడ్పాటునందిస్తూ నిర్మించుకున్న ఇళ్లను స్వచ్ఛందంగా ఖాళీ చేశారని తెలిపారు. స్వచ్ఛందంగా ఇళ్లు ఖాళీ చేసిన అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు


ప్రమాణస్వీకారం చేసిన స్థానిక హోప్ బాప్టిస్టు చర్చి నూతన కార్యవర్గం

ఆకివీడు: స్థానిక హోప్ బాప్టిస్టు చర్చి నూతన కార్యవర్గం ఆదివారం చర్చి ఆవరణలో ప్రమాణ స్వీకారం చేసింది. నూతన కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఎమ్వీ ప్రసాద్, అధ్యక్షుడిగా ఎం.విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా జి.ప్రమోద్‌కుమార్, కార్యదర్శిగా వి.సుందరరావు, ఉప కార్యదర్శిగా బి.జాన్‌సన్, కోశాధికారిగా ఎం.జాన్, ఆడిటర్ స్టీవెన్ సన్, డీకన్స్‌గా కె.సామ్యూల్, పి.అబ్రహం, కె.లాజరస్, ఎ.సత్యవతి (బేబీ), ఎస్.సువర్ణరాజ్యం, ఫీల్డ్ కౌన్సిల్ సభ్యులుగా కురెళ్ల పాలు, బొబ్బనపల్లి ఆదాముతో కమిటీ ఏర్పడింది. ఈ సందర్భంగా పాస్టర్ పి.సత్యానందం మాట్లాడుతూ నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు చర్చిలో కార్యకలాపాలు కొనసాగిస్తారని చెప్పారు.

ఎక్సైజ్ అధికారుల దాడి


అక్రమ మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

పాలకోడేరు: మండలంలోని గరగపర్రు లో అక్రమంగా మద్యం అమ్ముతున్నాడన్న సమాచారంతో భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో గరగపర్రు గ్రామానికి చెందిన డొల్ల దావీదు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతడి వద్ద నుంచి ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.బలరామరాజు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే ఫోన్ నంబర్ 9440902439కి తెలియజేయాలన్నారు. ఈ దాడుల్లో తనతోపాటు ఎస్సైలు పి.సునీల్ కుమార్, పి.ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

అమ్మవారికి వెండి గరగ సమర్పణ


అమ్మవారికి వెండి గరగను అలంకరిస్తున్న దృశ్యం

వీరవాసరం: మండలంలోని తోలేరులో వేంచేసియున్న శ్రీపోలేరమ్మ, దండు గంగాలమ్మ అమ్మ వార్ల జాతర మహోత్సవం సందర్భంగా ఆదివారం అమ్మవారికి వెండి గరగను సమర్పించారు. ఉపసర్పంచ్, ఉత్సవ కమిటీ చెర్మన్ భోగిరెడ్డి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు తూర్పుగోదావరి జిల్లా అజ్జరం గ్రామం నుంచి పంచ లోహాలతో చేసిన గరగను తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి అందజేశారు. ముందుగా అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

- గణతంత్ర దినోత్సవంలో వక్తలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


పాలకోడేరు జాతీయ పతాక స్తూపాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ మంతెన భారతి, చిత్రంలో మంతెన బాబు


ఉండి: జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో తదితరులు


భీమవరం అర్బన్: విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం (ప్రకాశంచౌక్): 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను భీమవరం మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, జాయింట్ కలెక్టర్, స్పెషల్ ఆఫీసర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రా రెడ్డి పాల్గొని జాతీయ పతాకావిష్కరణ చేశారు.

స్వాతంత్ర్య సమర యోధులను ఆదర్శంగా తీసుకోవాలి

భీమవరం: స్వేచ్ఛ, స్వాతంత్ర్యం,సమానత్వం, సౌభ్రాతృత్వం లక్ష్యంగా రాజ్యాంగం పరిరక్షణ అందరి బాధ్యత కావాలని సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆదివారం భీమవరం సీపీఐ జిల్లా కార్యాలయం వద్ద భీమారావు జాతీయ జెండా ఆవిష్కరించారు.

విష్ణు స్కూల్‌లో..

పట్టణంలోని విష్ణుస్కూల్ ఆవరణలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్కూల్ ప్రిన్సిపల్ ఎల్.బిందు జాతీయజెండా ఆవిష్కరణ చేసి విద్యార్థుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. కార్యక్రమంలో విష్ణు విద్యా సంస్థల క్యాంపస్ డైరెక్టర్ జె.ప్రసాదరాజు, డీజీఎం ఎం.రమేష్‌రాజు, పి.శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగఫలం

భీమవరం అర్బన్: ఈ రోజు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామంటే ఆనాటి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితమేనని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం 76వ గణతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మురళీ గంగాధరరావు, కోళ్ల నాగేశ్వరరావు, మెంటే పార్థసారథి, పి. బాబిరాజు, తాడేరు రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: మండలంలోని వాడవాడలా గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, గ్రామ సచివాలయాల వద్ద అధికారులు ప్రజా ప్రతినిధులు జాతీయ జెండాను ఎగురవేసి 72వ రిపబ్లిక్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉండి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, జెడ్పీటీసీ కరిమెరక కనదుర్గమహంకాళి జాతీయ జెండాను ఎగురవేశారు. తహసీల్దార్ కె.నాగార్జున, ఎంపీడీవో ఎస్.రవీంద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై ఎండీ నసీరుల్లా, ఆర్ఐ కార్తీక్, ఈవోపీఆర్డీ వెంకటరెడ్డి, ఎంపీటీసీలు, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.


వీరవాసరం: తహసీల్దార్ కార్యాలయం వద్ద గణతంత్ర దినోత్సవ వేడుకల దృశ్యం


భీమవరం: విష్ణు స్కూల్లో దేశనాయకుల వేషధారణలతో విద్యార్థులు


ఆకివీడు: ఎంపీడీఓ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకర్

ఆకివీడులో..

ఆకివీడు: గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో జెండా ఆవిష్కరణ చేశారు. విద్యార్థులతో జాతీయగీతం ఆలపించారు. మండల పరిషత్‌కార్యాలయం వద్ద ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకర్, పోలీస్ స్టేషన్‌వద్ద ఎస్సై హనుమంతు నాగరాజు, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, నగర పంచాయతీ వద్ద జెండా ఆవిష్కరించారు. ఎంపీపీ కఠారి జయలక్ష్మి,ఎంపీటీసీలు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జాతీయ పతాక స్తూపం ఆవిష్కరణ

పాలకోడేరు: మండలంలోని కోరుకొల్లు గ్రామంలో నూతన సచివాలయం వద్ద మంతెన వెంకట ప్రహ్లాద రాజు చారిటబుల్ ట్రస్ట్ వారిచే గణతంత్ర దినోత్సవం సందర్భంగా నూతన జాతీయ పతాక స్తూపం నిర్మించారు. ఆదివారం గ్రామ సర్పంచ్ మంతెన భారతి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం పతాకావిష్కరణ చేశారు. ముఖ్య అతిథులుగా నిర్మాణ దాత మంతెన వెంకట ప్రహ్లాద రాజు చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ మంతెన యోగీంద్ర కుమార్ (బాబు), కోరుకొల్లు–మైప ఎంపీటీసీ తంగెళ్ల మంజుల, గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.సునీత పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో బాల బాలికలు జాతీయ గీతాలు ఆలపించారు అనంతరం మిఠాయిలు పంచారు.

శృంగవృక్షంలో..

గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ కందగట్ల రఘురాములు, ఉపాధ్యక్షుడు కూర్మాల పూర్ణారావు, కోశాధికారి ఆత్యం వాసు, కూర్మాల నారాయణరావు, యానాది శెట్టి, సత్యనారాయణ, కూర్మాల నరసింహారావు, బ్రహ్మాజి, పసుమర్తి మాణిక్యాలరావు, మండ రమేష్, కూర్మా ల రాజా, గ్రంధి ప్రకాష్, గుడిమాస్ రాంబాబు, గునుపూడి చంద్రగుప్త, తదితరులు పాల్గొన్నారు.

కాళ్లలో..

కాళ్ల: మండలంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయా పంచాయతీ కార్యాలయాల్లో, పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాలు ఆలపించారు. ప్రధానంగా మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలో మండల పరిషత్ కార్యలయంలో ఎంపీడీవో స్వాతి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుందర్ సింగ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నారులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపాధ్యాయులు,విద్యార్థులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వీరవాసరంలో..

వీరవాసరం: రిపబ్లిక్ డే సందర్భంగా వీరవాసం మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు వద్ద ఆదివారం జెండా ఆవిష్కరణను పెద్ద ఎత్తున నిర్వహించారు. జాతీయ గీతాలను ఆలపించి చాక్లెట్లు పంపిణీ చేశారు. దేశ ,రాష్ట్ర ప్రగతికి ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో తాహసిల్దార్ ఏవి రామాంజనేయులు, ఎంపీడీవో రవి కిరణ్ కుమార్, ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని, గెడ్డం భారతి ,అడ్డాల శ్రీరామచంద్రమూర్తి ,వేంద్ర దివాకర్, గెడ్డం భాస్కరరావు ,సర్పంచులు, ఎంపీటీసీలు ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయంలో గణతంత్ర వేడుకల దృశ్యం


కాళ్ల: గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

సంయుక్త కిసాన్ మోర్చా ఆందోళన


ర్యాలీలో మాట్లాడుతున్న బలరాం

భీమవరం: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వ రంగాన్ని వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టమని, ప్రజలపై భారాలు మోపమని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బి.బలరాం డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం భీమవరం పట్టణంలోని విస్సాకోడేరు వంతెన వద్ద రైస్‌మిల్ సెంటర్ నుంచి ప్రకాశం చౌక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. నరేంద్రమోదీ నాయకత్వంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం నిత్యావసర వస్తువుపై విపరీతమైన భారం మోపి కార్పొరేట్లకు లాభాలు చేకూరుస్తున్నారని విమర్శించారు. రైతులు పోరాటంతో నల్ల చట్టాలు రద్దు చేస్తానన్న నరేంద్రమోదీ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.ఆంజనేయులు, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సుబ్బరాజు మాట్లాడుతూ రానున్న బడ్జెట్‌లో ఉపాధి హామీకి నిధులు పెంచాలని, కార్మిక హక్కులు హరించే లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు ఇచ్చే చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్‌మోర్చ జిల్లా కన్వీనర్ ఆకుల హరేరామ్, కలిదిండి గోపాలరాజు, శేషపు ఆశ్రియ్య, ఇంజేటి శ్రీనివాసరావు, డి.త్రిమూర్తులు, బంగారు వరలక్ష్మి, బి.గణేష్, చెల్లబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న దృశ్యం

భీమవరం: స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరంలో ఆదివారం ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరం, క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష, చర్మ సంబంధిత వ్యాధుల వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నేటి కలుషిత వాతావరణంలో క్యాన్సర్, చర్మ వ్యాధులు పెరుగుతున్న తరుణంలో వాటికి సంబంధించి వ్యాధి నిర్ధారణ పరీక్షల ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ అల్లూరి వంశీకృష్ణ, చర్మ వ్యాధుల నిపుణురాలు డాక్టర్ ప్రియాంక వర్మ మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రధానంగా మహిళల్లో అవగాహన అవసరమని, క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం ద్వారా వ్యాధి నివారణకు అవసరమైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డీటీడీసీ బాబు, పొత్తూరి బాపిరాజు, యర్రంశెట్టి శివకృష్ణ, కారుమూరి సత్యనారాయణమూర్తి, వెంకటపతిరాజు, పిఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి


హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న సీఐ బంటుమిల్లి శ్రీనివాస్

భీమవరం అర్బన్: ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బంటుమిల్లి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని కొవ్వాడ అన్నవరంలో శ్రీవిష్ణు కళాశాల వద్ద ఆదివారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లోల్ల భాగంగా హెల్మెట్ ధారణపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ బంటుమిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ భారం కాకూడదని బాధ్యతగా ధరించాలన్నారు. వాహనదారులు సెల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. హెల్మెట్ ధారణ వలన ఏదైనా ప్రమాదం జరిగితే తలకు గాయం కాదని మిగిలిన శరీర భాగాలకు గాయాలతై త్వరితగతిన కోలుకోవచ్చన్నారు. మైనర్ బాల బాలికలకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. కార్యక్రమంలో భీమవరం, పాలకోడేరు ఎస్సైలు ఐ.వీర్రాజు, రవివర్మ, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

పాలకోడేరు: మండలంలోని గొల్లలకోడేరులో ఆదివారం భీమవరం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్నప్పుడు ప్రమాదాలు జరిగినప్పుడు తలకి గాయాలు కావడం వల్ల అధిక శాతం మరణాలు సంభవిస్తున్నాయన్నారు. హెల్మెట్ లేకుంటే జరిమానా వేస్తారని భయంతో కాకుండా మన కుటుంబం కోసం హెల్మెట్ వాడాలన్నారు. కార్యక్రమంలో భీమవరం రూరల్ ఎస్సై వీర్రాజు, పాలకోడేరు ఎస్సై ఎం.రవివర్మ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవార్డులు

వీరవాసరం: దేశ, రాష్ట్ర ప్రగతికి సమాజంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రిటైర్డ్ కమర్షియల్ రైల్వే మేనేజర్ కాయల వెంకట్రావు అన్నారు. నేలపోగుల గ్రామంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదర్శ రైతు, ఉత్తమ విద్యార్థులకు అవార్డులను ప్రకటించి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే దేశభక్తి పెంపొందేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. దేశానికి రైతే రాజని, రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలను ఇస్తూ తోడ్పాటు అందించాలన్నారు. ముందుగా జాతీయ జెండా ఆవిష్కరించారు. సర్పంచ్ వేగేసిన భాను వర్మ , ఎల్.సత్యనారాయణ, పంచాయతీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించాలి

భీమవరం: రానున్న ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ, అధ్యాపక ప్రజా సంఘాలు బలపరిచిన ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) అభ్యర్థిగా దిడ్ల వీరరాఘవులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి పిలుపునిచ్చారు. పీడీఎఫ్ అభ్యర్థిగా దిడ్ల వీర రాఘవులను ప్రకటించిన నేపథ్యంలో ఈరోజు సాయంత్రం భీమవరం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో పరిచయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీవీ రాఘవులు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ అధ్యాపక విద్యార్థి యువజన మహిళ ప్రజా సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని భవిష్యత్తులో వారి సమస్యలపై పోరాడుతూ చట్ట సభల్లో తన గొంతును బలంగా వినిపించడానికి ప్రయత్నం చేస్తానన్నారు. కార్యక్రమంలో పీఎస్ విజయరామరాజు, ఆర్.రవికుమార్, ఏకేవీ రామభద్రం , ఎస్.జయప్రభ కె.రాజా రామ్మోహన్‌రాయ్, బి.బలరాం పాల్గొన్నారు.

గ్యాస్ ప్రమాదాలను నివారించాలి

ఆకివీడు: మన వంట గది భద్రత మన చేతుల్లోనే ఉందని నగర పంచాయతీ కో–ఆప్షన్ సభ్యులు మన్నే లలితాదేవి చెప్పారు. స్థానిక జెఎన్‌టీ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో మన వంట గది–మన బాధ్యత ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్యాస్ వినియోగంలో మహిళలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్యాస్ ఆన్ చేసినప్పుడు, ఆఫ్ చేసినప్పుడు తీసుకునే జాగ్రత్తలు చాలా ముఖ్యమన్నారు. సిలిండర్‌తో పాటు ట్యూబ్ కూడా కంపెనీదే ఉపయోగించాలన్నారు. పొయ్యిని సిలిండర్ కంటే ఎత్తులో ఉంచాలని సూచించారు. గ్యాస్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ వల్లీ శివ రామలక్ష్మి మాట్లాడుతూ ప్రతి మహిళా తన ప్రథమ కర్తవ్యం ఇంటి భద్రతేనన్నారు. కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో సామాజిక తనిఖీ

భీమవరం అర్బన్: మండలంలోని గూట్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం సామాజిక తనిఖీ నిర్వహించారు. ప్రభుత్వం నుంచి విడుదలైన నిధుల వినియోగంపై ఎన్ఆర్ఆర్ఈజీఎస్ నుంచి గోవిందరావు నేతృత్వంలోని చెన్నయ్య, నాగరాజుల బృందం లైబ్రరీ, మధ్యాహ్న భోజన పథకం తీరు, సైన్స్ ల్యాబ్, క్రీడా పరికరాలను తనిఖీ చేశారు. పాఠశాలకు మంజూరైన కొంత నిధులపై ప్రధానోపాధ్యాయురాలు ఆర్.సత్యవాణి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో గ్రామ సభ నిర్వహించారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉన్నారు.

మావుళ్లమ్మకు గజమాల

ఆకివీడు: భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మకు ఆకివీడుకు చెందిన పూలు, పండ్ల వర్తక సంఘం అధ్యక్షుడు షేక్ బాజీ గజమాలను తయారు చేసి, అమ్మవారికి ఆదివారం సమర్పించారు. గత 23 సంవత్సరాల నుంచి అమ్మవారికి గజమాలను ఉత్సవాల సమయంలో సమర్పిస్తున్నారు. ఈ ఏడాది 130 కేజీల పూలతో గజమాలను తయారు చేయించారు. తన సొంత ఖర్చులతో అమ్మవారికి గజమాలను సమర్పిస్తున్నట్లు బాజీ చెప్పారు. అమ్మవారంటే అపర నమ్మకమన్నారు. పూలు పండ్ల వర్తక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

గౌడ కులాన్ని చీలుస్తారా?

ఉండి: ఎన్నికల సమయంలో గౌడ కులానికి ఇస్తానన్నా 20 శాతం మద్యం దుకాణాలను ఇవ్వాలని అడిగితే లేని కులాలను చూపిస్తూ గౌడ కులాన్ని చంద్రబాబు చీలుస్తున్నారని వైఎస్సార్‌సీపీ మాజీ జిల్లా అధికార ప్రతినిధి బడుగు బాలాజీ పత్రికా ప్రకటనలో ఆదివారం ఖండించారు. రాష్ట్రంలో గౌడ కులంలో నాలుగు కులాలు మాత్రమే ఉన్నాయని, ఇప్పుడు 10 కులాలుగా చూపిస్తూ 20 శాతం మద్యం దుకాణాలు ఇస్తానని వాగ్దానం చేసిన చంద్రబాబు ఇప్పుడు 10 శాతం మాత్రమే ఇస్తూ 40 లక్షల గౌడ జనాభాను మోసగిస్తున్నారన్నారు.